# "ప్రథమ శ్రేణి"

(పల్లకి వినూత్న వారపత్రిక 5-1-1994)

---

హైదరాబాదు ప్రయాణం మొదటిసారి కాకపోయినా మొట్ట మొదటిసారిగా మొదటి తరగతి రైలు ప్రయాణం చేయబోవటం నాకు కొత్తగా ఉన్నది. గొప్పగా ఉన్నది. ఉత్సాహంగా ఉన్నది.

ఆఫీసువారి పుణ్యమా అని ఆ అవకాశం వచ్చింది. అప్పటి వరకు రైల్లో జనరల్ కంపార్ట్‌మెంట్‌లో మాత్రమే ప్రయాణం చేసిన నాకు అదో కొత్త అనుభవం ...

నేను పుట్టి పెరిగింది పల్లెటూర్లో. డిగ్రీ చదువుకున్నదీ పల్లెటూరి వాతావరణంలోనే. బంధువుల ఇళ్ళకి వెళ్లేందుగ్గానూ అప్పుడప్పుడు దూర ప్రయాణాలు చేసినా, ఎప్పుడూ మూడో తరగతి ప్రయాణీకుణ్ణే గానీ మొదటి తరగతి వాణ్ణి కాలేదు.

ప్రయాణానికి పదిరోజుల క్రితం నుండే స్నేహితులకు, సన్నిహితులకూ నేను ఫస్ట్ క్లాస్‌లో హైదరాబాద్ వెళ్తున్నట్లు చెప్పేసుకున్నాను. ఏదో రకంగా ప్రయాణాల ప్రస్తావన నేనే తీసుకు వచ్చి నా మొదటి తరగతి ప్రయాణం గురించి చెప్పి గర్వంగా అందర ముఖాల వ కా చూసేవాణ్ని.

మర్నాడే ప్రయాణం. సూట్‌కేస్ సర్దేసుకున్నాను శ్రీమతి సహకారంతో. నిజానికి ఆమెకూడా నాకన్నా రెండింతలు నా మొదటి తరగతి పయాణం గురించి ఇరుగు .. పొరుగుల వారితో చెప్పేసి సంబరపడింది.

పిల్లలు ముగ్గురూ నా చుట్టూ చేరి ఎవరికి ఏమి కావాలో చెప్పేరు. అవి కొనుక్కువస్తానని మాటిచ్చాకగానీ నన్ను ప్రయాణం

కావివ్వలేదు.

మరో స్నేహితుణ్ని వెంట పెట్టుకొని ఆ రైలు వచ్చే సమయానికి అరగంట ముందుగానే స్టేషన్‌కి చేరేను.

రిజర్వేషన్ చార్టులు చూసుకోవడమూ, నంబర్లు తెలుసుకోవడమూ, వగైరా పరిజ్ఞానం నాకు బొత్తిగా లేదు. చాలాసార్లు రైలు ప్రయాణం చేసినా కిక్కిరిసి ఉన్న జనరల్ కంపార్టుమెంటులో ఒంటి కాలి మీదో, రెండు కాళ్ళమీదో నిలబడటమో, ఎవరైనా కనికరించి కాస్తంత చోటిస్తే కూర్చున్నాననిపించుకుని గమ్యం చేరటమో మాత్రమే నా అనుభవం. అందుకే తోడుగా ఉంటాడని మిత్రుణ్ని కూడా స్టేషన్‌కి తీసుకువెళ్లాను

అతని సహకారంతోనే సునాయాసంగా నేను ఎక్కవలసిన మొదటి తరగతి కంపార్టుమెంటులో ఎక్కి కూర్చున్నాను. మరో అయిదు నిమిషాల్లో మిగిలినవారు కూడా ఎక్కేశారు.

సూట్‌కేస్ సీటుమీద ఉంచి రైలు దిగి మిత్రుడితో ముచ్చట్లాడుతూ నించున్నాను. సిగ్నల్ ఇచ్చారు రైలు కూత వినపడింది. మిత్రుడువద్ద వీడ్కోలు తీసుకుని రైలు ఎక్కాను ఒక చిన్న కుదుపుతో రైలు కదిలింది. మిత్రుడు చేయి ఊపి వెనుదిరిగేడు. నేను వెళ్ళి సీట్లో చతికిలపడ్డాను

నాకు ఎదురుగా వున్న రెండుసీట్లలో ఓ బట్టతల మధ్యవయస్కుడు, ఓ ఆడమనిషి కూర్చున్నారు. నా పైబెర్తులో నా వయసున్న వ్యక్తి పడుకున్నాడు.

అయిదు నిమిషాలయ్యాక బట్టతల మనిషి లేచి సూట్‌కేస్ తెరిచాడు. లుంగీ బయటకు తీసుకున్నాడు. ప్యాంట్, షర్టు విప్పి సూట్‌కేస్‌లో పెట్టుకున్నాడు. ఏదో ఇంగ్లీష్ నవల కూడా బయటకు తీసుకున్నాడు లుంగీ సవరించుకుని పుస్తకం చేత పట్టుకుని నడుం

వాల్చాడు. ఆవిడ కాస్తంత స్థూలకాయం కావటాన కొంచెం శ్రమ పడి పై బెర్తు కెక్కింది. ఆయాసంతో కాసేపు అవస్థపడి ఎయిర్‌పిల్లో తలకింద పెట్టుకుని పడుకుంది. ఆయన అప్పటికే పుస్తకంలో నిమగ్నమై పోయాడు.

మనుషులున్నా మాట్లాడుకునే అవకాశం లేకపోయి సందుకు నాకు విసుగ్గానూ, విచారంగానూ అనిపించింది

ఎన్నిసార్లు రైలు ప్రయాణం చేసినా హాయిగా కబుర్లతో కాలక్షేపం చేయటం, చోటుకోసం, సీట్లకోసం కయ్యానికి కాలు దువ్వే వారితోనూ, "అంతరం దిగిపోయే వాళ్ళమేగా ఎందుకీ కాసేపటికి ఈ కొట్లాటలు" అనే వేదాంత ధోరణులూ. మధ్య మధ్యలో పల్లీ పప్పుల వారి కేకలు, కాఫీ, టీల వారి అరుపులూ, రకరకాల బిచ్చగాళ్ళ అభ్యర్థనలూ. అలాంటి వాతావరణంలో సమయం తెలియకుండా గమ్యం చేరటమే నాకు అప్పటివరకూ వున్న అనుభవం.

పరిచయం లేకపోయినా పలుకరించి మరీ మాట కలుపుకుని కబుర్లాడే సామాన్యజనంతో ప్రయాణానుభవం వున్న నాకు యిలా పక్క మనిషితో ఏమాత్రం సంబంధం లేనట్లు, పలకరిస్తేనే నోటి ముత్యాలు రాల్తాయన్నట్లుగా మునగదీసుకుని కూర్చునే మనుషుల మధ్య ప్రయాణం సాగించడం నాకు చిరాగ్గానే కాదు, అసహజంగా కూడా అనిపించింది. నాలో అసహనం మొదలయ్యింది.

వాళ్ళలో దోషాల్ని వారి ప్రవర్తనలో లోపాల్ని వెతక్కపోతే నువ్వే పలకరించకూడదూ? అని అంతరాత్మ హెచ్చరించకపోలేదు.

ఎవర్తో మాట్లాడాలి. అక్కడున్న నలుగురిలో ఇద్దరు నిద్ర పోతున్నట్లున్నారు. నేను కాక ఇక మిగిలిన బట్టతల పెద్దమనిషి తదేకదీక్షతో పుస్తక పఠనం కొనసాగిస్తున్నాడు. ఇక నేను ఎవరితో మాట్లాడాలి.

అయినా అవతలివారు ఏమాత్రం ఆసక్తి చూపందే పలకరించటం, పరాభవాన్ని తట్టుకోవటం నాకు చేతగాని పని.

డబ్బున్న అహంకారంతో కొందరు, హెూదా వున్న అహంభావంతో కొందరు అవతలివారు తమ స్థాయికి సరిపోరని, అలాంటి వారితో మాట్లాడటం తమకు తామే తక్కువ చేసుకున్నట్లవుతుందని భావించే వారూ చాలామందిని నేను ఎరుగుదును.

అవసరానికి అతుక్కుపోయి ఆ కాస్తా తీరిపోగానే అవతలి వారివి ఎరుగనట్లే నటించే వారూ నాకు తటస్థపడ్డారు.

తమకు కాలక్షేపం కావలసి వచ్చినప్పుడు మాత్రమే ఎదుటి వారిని మాట్లాడించి, వారంతట వారుగా పలకరించినప్పుడు అనవసరపు హడావిడినీ, అసహనాన్నీ ప్రదర్శించే కుసంస్కారుల్నీ గమనించాన్నేను.

అందుకే అవతలి వారు ఏమాత్రం ఆసక్తి కనబరచందే మాట్లాడటం నాకు ఇష్టం వుండదు అప్పటికే నేను రెండు మూడు సార్లు ఆయన్తో పలకరించాలని ప్రయత్నించాను. అసలు తలెత్తి నా వంక చూస్తేనా. అందుకే ఆ ప్రయత్నం విరమించుకుని పడుకున్నాను

అసలు ఓ చిరునవ్వు కంటే ప్రియమైన పలకరింపు ఏముంటుంది. అదే విధంగా చిటపటలాడే ముఖాల్తో ఎలా మాట కలిపేది. నవ్వు ఆరోగ్యానికే కాదు. మరెన్నిటికో మేలు చేస్తుంది.

ఏమయితేనేం మాట్లాడేందుకు మనిషి దొరక్క అలవాటు లేని వాతావరణంలో అసహనంగానే కళ్లు మూసుకుని పడుకున్నాను

మనుషుల మనస్తత్వాల గురించి ఆలోచిస్తూ పడుకున్న నాకు ఆ రాత్రి చాలా ఆలస్యంగా నిద్రపట్టింది.

మెలకువ రావటం, ఒక్కసారిగా లేచి కూర్చోవటం ఒకేసారి జరిగింది ఆ కంపార్ట్‌మెంటులో ఒక్కరూ లేరు. (అసలు రైల్లోనే

లేరనే విషయం తర్వాత తెలిసింది.) రైలు సికింద్రాబాద్‌లో ఆగటం అక్కడ్నించి బయలుదేరి నాంపల్లి చేరటం జరిగి కూడా చాలాసేప యిందనే విషయం నా వాచీ ద్వారా తెలుసుకున్నాను.

హడావిడిగా సూట్‌కేస్ తీసుకుని రైలు దిగాను. సికింద్రాబాద్ నుంచి అయితే నేను వెళ్ళవలసిన మా అన్నయ్య గారిల్లు చాలా దగ్గర. కాని ఇప్పుడు నాంపల్లి నుంచి మైలార్‌గడ్డలోని వాళ్ళ ఇంటికి వెళ్ళాలంటే బస్ నంబర్లు నాకు తెలియవు. పైగా మళ్ళీ అక్కడ్నుంచి మా ఆఫీసు అడ్రస్ కనుక్కుని వెళ్ళాలి. అందుకే ఆటో ఎక్కాను.

"మాట కలిపి పలకరించకపోతే మానే కనీసం వాళ్ళు దిగేట ప్పుడు నన్ను లేపకూడదా" అనుకున్నాను మనసులో.

"మామూలు మనుషులయితే తప్పకుండా తట్టి లేపేవారే కాని వాళ్ళు మొదటి తరగతి టిక్కెట్టు కొన్న ప్రథమ శ్రేణి ప్రయాణీకులు కదా. అది వాళ్ళ 'ప్రెస్టేజి పాయింటు'" అని మందలించింది అనుభవం. "అవును కదూ" అనుకుని నాలుక్కరుచుకున్నాను.

అన్నయ్య గారింటికి వెళ్ళటం, వాళ్ళతో మాట్లాడుతూనే కాల కృత్యాలు ముగించేసి, కాఫీ టిఫిన్లు పూర్తి చేసుకుని ఆఫీసుకు బయ ల్దేరాను:

అనుకున్నంత కష్టపడకుండనే ఆఫీసు అడ్రస్ కనుక్కో గలి గాను. అది కొంత ప్రశాంతత కలిగించింది. సాయంత్రం వరకూ ఆఫీసులో పనిచేసుకుని అయిదు గంటలకు బయటపడ్డాను.

మధ్యాహ్నం నుంచీ ఆటోలు బంద్ చేశారట. నేను బోట్స్ క్లబ్ దగ్గర్నుంచి బషీర్‌బాగ్‌లోని గాంధీ మెడికల్ కాలేజి వరకు వెళ్ళాలి ఆటోల్లేవు కనుక తప్పనిసరిగా సిటీ బస్ ఎక్కవలసిందే. దగ్గర్లో వున్న బస్ స్టాప్ దాకా వెళ్ళి నుంచున్నాను.

"బషీర్‌బాగ్ వెళ్ళాలంటే ఎన్నో నంబరు బస్ ఎక్కాలండీ"

అనడిగాను అక్కడున్న ఒకతన్ని. చెప్పేడతను.

టాంక్‌బండ్ చివర్న దిగితే చాలు అక్కడ్నుంచి నడిచి వెళ్లొందుకు నాకు తెలుసు. పైగా అక్కడ్నుంచి దగ్గరగూడా. అదేవిషయం అతగాడితో చెప్పాను.

"అయితే మీరు ఏబస్ ఎక్కినా పరవాల్లేదు. అన్నీ అటుగానే వెళ్తాయ్" అని అతడు అంటుండగానే దూరంనుంచి ఓ బస్ వస్తూ కనిపించింది,

నాకు కొంచెం దూరంగా మరోయువకుడు నించుని మాఇద్దరి మాటలు వి.టున్నాడు. బస్ రావటంతోటే జనం పరుగెత్తుకుంటూ వెళ్ళి బస్ లోపలికి జొరబడ్డారు.

ఆ వత్తిడిలో ఎందుకు లెమ్మని మరో బస్ వచ్చాక అందులో ఎక్కాన్నేను. అప్పటి వరకు నా వెనుక నుంచుని నా మాటలు ఆల కించినతను కూడా నాతోపాటే బస్ ఎక్కాడు.

బస్ ఎక్కగానే "బషీర్‌బాగ్ వెళ్తుందా" అనడిగాడు నాతో పాటు ఎక్కినతను, పక్కనున్న వ్యక్తితో.

"ఏ బషీర్‌బాగ్ నై జాతా" చెప్పాడతను.

"నేను టాంక్‌బండ్ చివర దిగాలంటే టికెట్ ఎక్కడికని అడ గాలి " అవడిగాను పక్కనతన్ని.

"అక్కడస్టాపు లేదండీ మీరు .... వరకు తీసుకోండి" చెప్పే డతను. ఇంతలో కండక్టర్ వచ్చాడు.

నేను, నాతోపాటు బస్ ఎక్కినతనూ ఇద్దరం ఒకేసారి అతని చేతిలో డబ్బులు పెట్టాం. మేం ఎక్కడికని చెప్పేమో కూడా విన కుండా రెండు టిక్కెట్లు చింపి అతగాడి చేతిలో పెట్టాడు.

అప్పటికే బస్ టాంక్‌బండ్ సగం దాటి వచ్చింది. అన్న మయ్య విగ్రహం కూడా దాటింది. బుద్ధుడి విగ్రహం వెనక్కి వెళ్ళి

పోయింది. ఆంధ్రప్రభ ఆఫీసు బోర్డు కన్పించి వెనక్కి పరుగుతీసింది అంతలోనే బస్ టాంక్‌బండ్ చివరికి వచ్చేసి రెడ్ సిగ్నల్ పుణ్యమా అని తక్కున ఆగిపోయింది.

అప్పటికే డోర్ దగ్గరకు వచ్చి నిల్చున్న నేను ఛంగున దిగేశాను. హిమాయత్‌నగర్ వైపు నుంచి వస్తున్న ట్రాఫిక్ ప్రవాహాన్ని తప్పుకుంటూనే నాతోబాటు బస్ ఎక్కిన వ్యక్తిగూడా దిగటం గమనించాను. రోడ్డు దాటి అటు ప్రక్కగా నిల్చున్నాను అతను బస్ దిగాడు కాని మళ్ళీ ఎక్కేస్తున్నాడు.

"అవునూ అతను కూడా బషీర్‌బాగ్ వెళ్ళాలని కదూ అన్నాడు" అనుకుని గట్టిగా చప్పట్లు కొట్టాను. అప్పటికే డోర్ దగ్గర కడ్డీ పుచ్చుకుని అడుగుపెడుతున్న అతను ఒక్కసారి వెనుతిరిగి నన్ను చూశాడు బస్ కదులుతుండగానే దిగి వడివడిగా నావైపు అడుగులు వేశాడు.

"అవునూ మీరు బషీర్‌బాగ్ కదా వెళ్లాలన్నారు" అడిగాన్నేను.

"అవునండీ అందుకే మీ వెనకాలే దిగేను. కాని దిగాక మీరు కన్పించలేదు నాకు. పొరపాటున నేను ఎవర్నో చూసి మీరనుకున్నా నేమో మీరు బస్‌లోనే వుండిపోయారేమో అనుకుని మళ్ళీ బస్ఎక్కబోయేంతలో మీరు పిల్చారు" ......

"కండక్టర్ రెండు టిక్కెట్లూ నా చేతికే ఇచ్చాడు కదా నేను ఇక్కడ దిగిపోతే మీరు ఇబ్బంది పడతారని మళ్ళీ బస్ ఎక్కేశాను" అని వివరించాడతను.

అతని మాటలు నాకు ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని కలిగించినై అతనికక్కడా ఊరు బాగా తెలియదు అయినా నా కోసం నేను టిక్కెట్ మూలంగా ఇబ్బంది పడ్తానేమోనని........

ఆత్మీయంగా అతని భుజం చుట్టూ చేయి వేశాను. నిజమైన ప్రథమ శ్రేణి ప్రయాణీకుడు ఇతడే అనిపించింది. ఖరీదయిన టికెట్ కొని మొదటి తరగతిలో ప్రయాణం చేసినా తోటి మనిషి గురించి పట్టించుకోలేని వారు ప్రథమ శ్రేణికి చెందరని కూడా అనిపించింది.

ఇద్దరం కలిసి కాఫీ తాగి ఎవరి దారిన వాళ్ళం ప్రయాణమయ్యాం.

— ० —